క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి పల్లకీ సేవలో పాల్గొన్న పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: పట్టణంలోని అన్నపూర్ణా థియేటర్ ఎదురుగా ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ 51వ వార్షికోత్సవం సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ స్వామివారి పల్లకీ సేవలో పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో దార్ల శ్రీనివాస్, కొసనా ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయవరం: పసలపూడి బైపాస్ సెంటర్‌లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పోతంశెట్టి దుర్గాప్రసాద్‌రెడ్డి, భవ్యశ్రీ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణంలో పసలపూడి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



ద్రాక్షారామలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 28వ తేదీన విజయవాడలో భూ సమస్యలపై జరుగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏఐకేఎంఎస్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. మండలంలోని ద్రాక్షారామలో కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో పోస్టర్ ఆవిష్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, సీపీఐ ఎంఎల్(న్యూ డెమోక్రసీ) ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 28న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో భూ సమస్యలపై జరిగే రాష్ట్ర సదస్సును రైతు కూలీలు, కౌలు రైతులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, గుర్రాల సత్యవేణి, వెంటపల్లి రామకృష్ణ, పట్టాభి, సత్యనారాయణ, దడాల శ్రీను, చిన్న పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు పరామర్శ



శ్రీనివాస్ తల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పాపారాయుడు ఇతర నాయకులు

మండపేట: మాతృ వియోగం పొందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శిరంగు శ్రీనివాస్ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు సోమవారం పరామర్శించారు. అలాగే అదే పార్టీకి చెందిన నాయకులు కుడిపూడి రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పలివెల సుధాకర్, శెట్టి నాగేశ్వరరావు, యాండ్ర బుజ్జిలు కూడా పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాతృమూర్తి స్వర్గీయ చంద్రావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, పట్టణ ప్రముఖులు చింతల శ్రీనివాస్, బొడ్డు రామకృష్ణ, బండి గోవిందు, వాసా రవికిరణ్‌బాబు, కుక్కల రామారావు, దాసరి బుజ్జి, బొడ్డపాటి మంగరాజు, ఉపాధ్యాయుడు వాడ్రేవు శ్రీనివాస్, గోకరకొండ ప్రసాద్ పరామర్శించారు.

ఆక్రమణల తొలగింపు

మండపేట: వెలగతోడులో కాలువకు చేర్చి ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి మాంటిక్ క్లియర్ కాలువ చెంతన ఎన్నో ఏళ్లుగా కొంతమంది బడ్డీలు, షెడ్లు వేసుకుని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తుతో అక్కడ ఉన్న నాలుగు దుకాణాలను తీసివేయించారు. జేసీబీ సాయంతో పూర్తిగా కూల్చి వేశారు. ఇరిగేషన్ జేఈ షబీనా మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై తామీ చర్యలకు తీసుకున్నట్టు తెలిపారు. పదేళ్లుగా అక్కడ దుకాణాలు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, అర్థాంతరంగా కూల్చివేస్తే ఎక్కడికి పోవాలని బాధితులు వాపోయారు.

శివ క్షేత్రాలు.. ముక్తిధామాలు

- శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు
- రెండు నియోజకవర్గాల్లో ప్రాశస్త్యం ఉన్న శివ క్షేత్రాలు
- అష్ట సోమేశ్వరాలయాల్లో పశ్చిమ ముఖాన కోరుమిల్లి ఆలయం
- రేపు మహాశివరాత్రి పర్వదినం



కోరుమిల్లి సోమేశ్వరస్వామి



పడమర ఖండ్రికలోని త్రయంబకేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: క్షేత్రం మానవ జీవిత గమనానికి మార్గదర్శకం. ప్రకృతి శక్తుల పెన్నిధిలో మనిషి సేదతీరుతుంటాడు. సందర్భానుసారం దైవ క్షేత్రాలను దర్శిస్తూ ముక్తిమార్గం కోసం పరితపిస్తుంటాడు. అలాంటి పుణ్య క్షేత్రాల్లో శైవ క్షేత్రాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా కొన్ని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఉన్నాయి. శివరాత్రి పర్వదినాన శివయ్య సన్నిధికి చేరేందుకు భక్తులు సన్నద్ధమయ్యారు. గౌతమీ గోదావరి జాలువారు జడనీడన కొలువైన కోటిపల్లి శివుని జాతర దగ్గర పడింది. మాణిక్యాంబ సమేత భీమేశ్వరుని చెంత చేరేందుకు భక్తులు బారులు తీసే సమయమాసన్నమైంది. కోటి కాంతుల కోరుమిల్లి సోమేశ్వరుడి కరుణ కటాక్షం కళ్లముందు ప్రత్యక్షమయ్యే శివరాత్రి ఉత్సవం రానే వచ్చింది. ఈ నెల 26వ తేదీన శివునికి ఇష్టమైన రోజు శివరాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

శివుని సన్నిధికి దారులిలా...

రామచంద్రపురం పట్టణానికి ఆరు కిలోమీటర్లు దూరంలో ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం ఉంది. రామచంద్రపురం నుంచి 21 కిలోమీటర్లు దూరాన కోటిపల్లి దైవ క్షేత్రం ఉంది. ఆయా క్షేత్రాలకు నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి. మండపేటకు 20 కిలోమీటర్లు దూరంలో కోరుమిల్లి సోమేశ్వరస్వామి ఆలయం, ఆరు కిలోమీటర్లు దూరాన ద్వారపూడి దేవతామూర్తుల దైవ క్షేత్రమూ ఉన్నాయి. ద్వారపూడికి నిత్యం ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటుండగా కోరుమిల్లికి ఒక ఆర్టీసీ సర్వీసు అందుబాటులో ఉంది. ప్రైవేటు వాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

అత్యంత ప్రాశస్త్యం గల క్షేత్రాలు

రామచంద్రపురం నియోజకవర్గంలో పంచారామాల్లో ఒకటైన మాణిక్యాంబికా సమేత భీమేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. జిల్లాలోని అష్ట సోమేశ్వరాలయాల్లో నాలుగోది కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామంలో కొలువైన రాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం ఉంది. దానికితోడు ఈ ఆలయం పశ్చిమ ముఖాన ఉండడం మరో ప్రత్యేకత. అష్ట సోమేశ్వరాలయాల్లో మిగిలిన ఆలయాలైన కోలంక, దంగేరు, కోటిపల్లి, వెంటూరు, సోమేశ్వరం, వెల్ల, పెనుమళ్లలోని ఏడు సోమేశ్వరాలయాలు తూర్పు ముఖాన నిర్మితమయ్యాయి. కోరుమిల్లి సోమేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలకు వేర్వేరు గర్భగుడిలుండటం ప్రత్యేకత. ఈ ఆలయాన్ని ఆనుకుని నవ జనార్దనాలయాల్లో ఎనిమిదో జనార్దనాలయం తూర్పు ముఖాన ఉంది. జనార్దనస్వామి సాధక ముద్రలో దర్శనమిస్తారు. అటు శైవ, ఇటు వైష్ణవాలలో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఆలయాలు పక్క పక్కన ఉండడం, ఆ రెండు ఆలయాలు అభిముఖంగా ఉండడం మరో ప్రత్యేకత. రెండు ఆలయాలు ఒకే చోట ఉండడంతో కార్తిక, ధనుర్మాసాల్లో సందడి నెలకొంటుంది. సోమేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన పూర్వాషాడ నక్షత్రాన పుట్టిన భక్తులు స్వామికి విశేష పూజలు చేస్తుంటారు. ఏడాది పొడవునా ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేస్తారు. కోటిపల్లిలో శివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు.

మరెన్నో ప్రసిద్ధ ఆలయాలు

మండపేట పట్టణంలో అగస్తేశ్వరస్వామి, సీతారమ క్షేత్రం, అయ్యప్పస్వామి, శివాలయం, ఏడిద సంఘమేశ్వరాయలం, కేశవరంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాలు శివరాత్రికి రద్దీగా ఉంటాయి. ద్వారపూడిలోని అయ్యప్పస్వామి క్షేత్రం ఆంధ్ర శబరిమలగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ 60 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో ఆదియోగి(జ్ఞానయోగి) విగ్రహం ఆకర్షణీయంగా దర్శనమిస్తుంది. రాయవరం మండలం సోమేశ్వరంలోని బాల త్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్తేశ్వరస్వామి, వెంటూరులో ఉమా సమేత సోమేశ్వరస్వామి, వెదురపాక రాయవరం, మాచవరం, పసలపూడి, గ్రామాల్లోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి ఆలయంతోపాటు కపిలేశ్వరపురంలోని అగస్తేశ్వర, పాపవినాసేశ్వర, అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వర స్వామి, త్రయంబకేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహిస్తారు.



పడమర ఖండ్రికలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

పుణ్య స్నానాల రేవులు

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం కోటిపల్లి, మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి పుష్కర ఘాట్లలో పుణ్య గౌతమి గోదావరి స్నానమాచరించొచ్చు. మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లో పెద్దకాలువ రేవులు, మెహర్ ఆశ్రమం, పాలతోడు శివాలయం వద్ద రేవు, వెలగతోడు-తాపేశ్వరం రహదారిలోని దోనె రేవు, మేడపాడు దుర్గాదేవి ద్వారపూడి అయ్యప్ప స్వామి, ఆలయాలు వద్ద, పేకేటిపాకలు రేవుల్లో పుణ్యస్నానాలు చేయవచ్చు.

రాయవరం మండలం సోమేశ్వరం కాలువ రేవు, రాయవరం, వెదురుపాక గ్రామాల పరిధిలోని తుల్యభాగ నది రేవులు, పసలపూడి, నదురుబాద, వెంటూరు గ్రామాల్లోని కాలువ, కోరంగి, టేకి డ్రైన్ల పరిధిలోని రేవుల్లో పుణ్యస్నానాలను ఆచరిస్తుంటారు. వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల భక్తులు కోరంగి కెనాల్ రేవుల్లోనూ, అంగర, పడమర ఖండ్రి, టేకి, మాచర గ్రామాల్లోని రేవులను సిద్ధం చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



కోటిపల్లి ఫెర్రీలో పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రఘువీర్



పుష్కర ఘాట్‌లను శుభ్ర పరుస్తున్న దృశ్యం

కె.గంగవరం: కోటిపల్లి సోమేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే శివరాత్రి మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏటా సుమారుగా లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా ఉండడంతో అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించడానికి జల్లు స్నాన ఘట్టాన్ని కూడా సిద్ధం చేశారు. అయితే ఏడాది పుష్కర ఘాట్ నుంచి సుమారు 500 మీటర్ల దూరం వరకు ఇసుక మేట వేయడంతో పుణ్యస్నానాలు ఆచరించే వారు కొంత దూరం నడిచివెళ్లాల్సి వస్తుంది. పుణ్యస్నానాలు ఆచరించే చోట 30 బోట్లను 60 మంది గజఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ సోమవారం కోటిపల్లి రేవును పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఊరు ప్రారంభంలో పార్కింగ్ పాయింట్ ఉందని అక్కడ నుంచి ఎటువంటి వాహనాలు లోపలికి రాకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పంచాయతీ సర్పంచ్ పెమ్మాడి బేబిసత్తిబాబు నేతృత్వంలో రేవులో పుష్కర ఘాట్లు బురదమయంగా ఉండడంతో ఫైర్ సిబ్బంది సహాయంతో బురదను తొలగించే చర్యలు తీసుకున్నారు. ఆలయం వెలుపల, లోపల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లు ఉన్న చోట్ల ఎండ తగలకుండా టెంట్లను సిద్ధం చేశారు.

రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదు



అయితపూడిలో పార్టీ నాయకుడు కంచి వేంకటేశ్వర్రావుని పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్

కాజులూరు: రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుడు, రామచంద్రపురం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సూర్యప్రకాశ్ పర్యటించారు. ముందుగా అయితపూడిలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలైన పార్టీ నాయకుడు కంచి వెంకటేశ్వరరావుని పరామర్శించారు. మండల పార్టీ మహిళా విభాగ నేత, తిప్పరాజుపాలెం ఎంపీటీసీ ఆనాల సీత అత్తగారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాలలో కార్యకర్తలను కలుసుకుని స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలలో భాగంగా రైతులకు రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించించిందన్నారు. కేంద్రం ఇప్పటికే కేంద్రం మూడోసారి సాయం అందిస్తుండగా రాష్ట్ర ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గిట్టుబాటు ధరలు సైతం ఇవ్వకపోవంతో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కుటమి ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పార్టీ మండల యువజన విభాగ అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, వైఎస్ఆర్ యవసేన రాష్ట్ర కార్యదర్శి ఉంగరాల శివ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వ్యర్థాలు రోడ్డుపై పోస్తే చర్యలు తప్పవు



ఆరో వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ ఇష్టానుసారం రోడ్లపై పోసి వదిలేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. స్వచ్ఛ మండపేట లక్ష్యం నెరవేరాలంటే ప్రతీ ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. అలాగే తడి, పొడిచెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలన్నారు. డ్రైన్లలో చెత్తాచెదారాలు పోసిన, భవన యజమానులు నిర్మాణ సమయంలో వచ్చిన వేస్ట్ మెటీరియల్‌ను రోడ్లపై పోసి పట్టించుకోనట్టు వదిలేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆరో వార్డు పరిధిలోని బురుగుంట చెరువు పక్క వీధుల్లో ఆయన ఇంటింటా పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తడి చెత్తను హోం కంపోస్టుగా మార్చితే ఎరువు తయారవుతుందని దానితో ఇళ్ల వద్ద మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చని సూచించారు. అలాగే పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని ప్రజలంతా గమనించి మార్కెట్‌కు వెళ్లే సమయంలో గన్నీ, క్లాత్ బ్యాగ్స్ వెంట పట్టుకుని వెళ్లాలని గుర్తుచేశారు. వేస్ట్ మెటీరియల్ రోడ్డుపై వేసినందుకు గాను ఓ నిర్మాణదారునికి రూ.300 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సీవో, శానిటేషన్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో జరిగిన విశ్వేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్నపూర్ణ విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో కొంతేటి బాలసుబ్రహ్మణ్య శర్మ, కొంతేటి విశ్వనాథ శర్మ, దేవులపల్లి ఫణిరామకృష్ణల శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

నేడు స్వామి వార్ల నగరోత్సవం

సోమవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు నిర్వహించనున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 25న మంగళవారం కల్యాణ మూర్తుల నగరోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ దుర్గా భవాని తెలిపారు. అదేవిధంగా 26న మహా శివరాత్రి, మాస శివరాత్రితో పాటు కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆవు నేతితో అఖండ దీపారాధన, సదస్యం, స్వామివార్ల నగరోత్సవం, 27న స్వామి వార్ల నగరోత్సవం, 28న నాకబలి, త్రిశూల స్నానం, వసంతోత్సవం, మార్చి ఒకటిన స్వామి వార్ల శ్రీ పుష్పోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

ఘనంగా సంగమేశ్వరుని రథోత్సవం



నయనానందకరంగా సాగిన రథోత్సవం

మండపేట: దక్షిణ కాశీగా పేరుందిన సంగమేశ్వర స్వామి వారి రథోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. మండలంలోని ఏడిదలో ఉన్న కైలాశేశ్వర స్వామి దేవాలయంలో ఉన్న స్వయంవర పార్వతీ పరమేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను వేద మంత్రోచ్చరణల మధ్య రథంపై అలంకరించారు. రథంపై కొలువు తీరిన స్వామి వార్లను ఊరేగించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.శోభారాణి పర్యవేక్షణలో జరిగిన రథోత్సవంలో గ్రామస్తులు, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సంగమేశ్వర క్షేత్రంలో స్వయంవర పార్వతీ స్వయంవర సమేత పార్వతీ సంగమేశ్వరస్వామి, వేణుగోపాల స్వామివార్ల కల్యాణం సోమవారం రాత్రి రంగరంగ వైభవంగా జరిగింది.

శివరాత్రి ఏర్పాట్లు పూర్తి..

ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రాచీన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఏడిద సంగమేశ్వరంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం శోభారాణి తెలిపారు. ఈ నెల 26 బుధవారం జరిగే మహాశివరాత్రి సందర్భంగా సంగమేశ్వర క్షేత్రం వద్ద వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. స్నానఘట్టాలు, భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. శివరాత్రి నాడు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దాతలు కూడా అన్నప్రసాదాలను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.

వైభవంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజ చేస్తున్న వేదపండితులు

కె.గంగవరం: కూళ్ల గ్రామంలో ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం వార్షిక లక్ష తులసి పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం, దీపోత్సవం వంటి పూజాధికాలు నిర్వహించారు. ఈ పూజల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సతమతమవుతున్న వీఆర్వోలు



రామచంద్రపురం ఆర్డీఓ అఖిలకు సమస్యలు వివరిస్తున్న వీఆర్ఓలు

రామచంద్రపురం: ఎంఎస్ఎంఈ సర్వేలో ప్రగతి లేనందుకు రామచంద్రపురం మండలంలోని వీఆర్వోలు 21 మందికి రామచంద్రపురం మండల అభివృద్ధి అధికారి కడలి పద్మజ్యోతి ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానంగా మండలంలోని వీఆర్వోలు అందరూ రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిలను సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలకు అత్యంత ప్రాధాన్యత ఉన్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో మంజూరు చేసిన లబ్ధిదారుల రీసర్వే, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రైతు గుర్తింపు సంఖ్య, రైస్ కార్డుల ఈ కేవైసీ, ప్రజా పంపిణీ వ్యవస్థ తదితర అంశాలలో వీఆర్వోలు నిత్యం క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నామన్నారు. అటువంటి సమయాల్లో లైన్ డిపార్టుమెంటు, జీఎస్‌డబ్ల్యూ డిపార్టుమెంటులు ఒకే సమయంలో రెండు వేర్వేరు ఆదేశాల ఇవ్వడం తమకు చాలా ఇబ్బందికరంగా ఉంటోందని ఆర్డీఓకు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏలేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు స్వామి నాయుడు, రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు చిన్న, రామచంద్రపురం మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, నరేష్‌కుమార్, సత్యవతి, ప్రతిమ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించేందుకు, నూతన ఆధార్ నమోదుకోసం ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. సచివాలయాల పరిధిలోని చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం పడమర ఖండ్రిక, నేలటూరు, మాచర గ్రామ సచివాలయాల్లోనూ 28న వల్లూరు, కపిలేశ్వరపురం, టేకిలలోనూ శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రలు ఆధార్ వివరాలను నవీకరణ చేస్తారని ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

నేడు ఉయ్యాల జంపాల దైవ క్షేత్రం వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో శ్రీ త్రయంబకేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. కొమాళ్ళపల్లి సత్యనారాయణ మూర్తి, శ్రీకంఠం ప్రభాకరశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు కొమాళ్ళపల్లి సత్య సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. మంగళవారం స్వామి కల్యాణం, 26న ఆలయం వద్ద తీర్థం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన



బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న రాయవరం ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థినులకు 'మహిళా సంరక్షణ' కార్యక్రమంలో భాగంగా బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్యలు ఎదురైన సందర్భంలో వాటిని ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని బాలికలు కలిగి ఉండాలన్నారు. పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొనే సమస్యలు ఏమైనా ఉంటే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో లెటర్ రాసి వేయాలన్నారు. సమస్యలపై లేఖలు రాసే సందర్భంలో ఫిర్యాదు రాసిన వారి పేరు రాయనవసరం లేదన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి మహిళా పోలీసు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర సమయాల్లో బాలికలు 112, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు, సైబర్ క్రైమ్ జరిగితే 1930 నంబరుకు, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే రాయవరం పోలీస్‌స్టేషన్ ఎస్సై 9440904843 నంబరుకు ఫోన్ చేయవచ్చునని ఆయన సూచించారు. పాఠశాల హెచ్ఎం ఆర్.దయామణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళా కానిస్టేబుల్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చెల్లూరులో గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయవరం: చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో కలిశారు. 1979–80 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 44 సంవత్సరాల అనంతరం తిరిగి తాము చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. నాటి బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు కూరెళ్ల చంటి, నూనె సాయిబాబా, బి.గోవిందరాజులు, మేకా శ్రీనివాస్, సత్తి భామిరెడ్డి, మరిడయ్య, వసంతలక్ష్మి, పద్మ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.